క్లుప్తంగా

ప్రశాంతంగా మోడల్ ప్రవేశ పరీక్ష



రెంజల్: ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు నిర్వహించిన అర్హత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. రెంజల్‌లోని ఆదర్శ పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 6వ తరగతిలో ప్రవేశానికి 162 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా 139 మంది హాజరయ్యారు. 7 నుంచి 10వ తరగతి ప్రవేశాలకు 136 మంది దరఖాస్తు చేసుకునగా 116 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని సీఎస్ ఈశ్వర్, డీవో గోపి తనిఖీ చేశారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



బోధన్‌టౌన్: సమస్త మానవాళికి యేసు క్రీస్తే అధిపతి అని సీనోడ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ చర్చిల ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలకు ఆయన హాజరై మాట్లాడారు. చర్చిలో క్రైస్తవులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చి కమిటీ ప్రతినిధులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ ప్రభాకర్, స్టీఫెన్ అనిల్, చర్చి కమిటీ ప్రతినిధులు జ్యోతిరాజ్, ఎడ్వర్డ్ ముల్లర్, పుష్పరాజ్, కిశోర్ కుమార్, దాస్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



ఆర్మూర్‌టౌన్: నిత్య జీవితంలో ప్రతిఒక్కరూ పౌష్టికాహా రం తీసుకుంటేనే ఆ రోగ్యంగా ఉంటారని చేయూత స్వ చ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు మధుశేఖర్ అన్నారు. పట్టణంలోని సామాజిక సేవకుడు తులసికుమార్ ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రూపొందించిన ఆహారం–ఆరోగ్యం అనే చార్ట్‌ను డాక్టర్ మధుశేఖర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రతీ రోజు యోగా, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అశోక్, రాజన్న, సాగర్, రాము తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కొక్కెర భూమన్న



ఆర్మూర్‌టౌన్: పట్టణానికి చెందిన మాదిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కొక్కెర భూమన్నకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు భూమన్న పేర్కొన్నారు. నాయకులు కూరగాయల స్వామి, రవి, పెంటయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సన్మానం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఇటీవల నూతనంగా ఎన్నికైన వన్నెల్‌దేవి లావణ్యశ్రీనివాస్‌ను పిప్రి కాలనీ మున్నూరుకాపు సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని అన్నారు. మున్నూరు కాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



ఆర్మూర్‌టౌన్: ప్రజలు తమ కాలనీ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గోసికొండ అశోక్ అన్నారు. పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ కాలనీ సమైక్య కాలనీ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో ఉత్సాహంగా శ్రమదానం చేస్తూ పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబాగౌడ్, సభ్యులు పుప్పాల శివరాజ్ కుమార్, సత్యనారాయణ గౌడ్, సుంకె శ్రీనివాస్, రాజు, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివేదిక రాక ముందే నిర్మాణాలు!

- బాల్కొండలో రాజ్యమేలుతున్న భూకబ్జాదారులు
- మామూళ్ల మత్తులో అధికారులు



సర్వే నంబరు 1333లో చేపడుతున్న నిర్మాణ పనులు

బాల్కొండ: మండల కేంద్రంలో భూ కబ్జాదారులు రాజ్యమేలుతున్నారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 1333లో ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నివేదిక రాక ముందే ఆ భూమి పక్కన ఉన్న కొన్ని నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. దీంతో భూ కబ్జాదారులు ఆడింతే ఆటగా సాగుతోంది. సర్వేనంబరు 1333లో ఉన్న 224.19 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేసేందుకు రెండు నెలల నుంచి సర్వే చేపడుతున్నారు. అంతే కాకుండా సర్వేలో పలు లోపాలు ఉన్నాయని స్థానికులు ఉన్నతాధికారులకు నిరంతరం ఫిర్యాదు చేస్తుండటంతో గతంలో ప్రభుత్వం కేటాయించిన పట్టాలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ఆ భూమిలో చేపట్టిన సర్వే నివేదిక ఇప్పటి వరకు రాలేదు. అయినా సర్వే సమయంలో నిలిపి వేసిన భవనాల నిర్మాణాలను మాత్రం రాత్రికి రాత్రి నిర్మించేస్తున్నారు. ఇది తెలిసిన అధికారులు మాత్రం తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం సర్వే నంబరు 1333 పక్కన ఉన్న స్థలంలో నిర్మిస్తున్న నిర్మాణంలో రెండు పిల్లర్ల వరకు 1333లలో ఉందని గుర్తించి సర్వే అధికారులు హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. కానీ నిర్మాణాలు మాత్రం ఆగడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి భూకబ్జాలను అడ్డుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జీపీ అధికారుల తీరుపై మొదటి నుంచి స్థానికులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు వేడుకుంటున్నారు.

ఇళ్ల కోసం అనుమతి.. నిర్మించేది షటర్లు

మండల కేంద్రంలో ఇంటి నిర్మాణాల్లో జరుగుతున్న లీలలు చాలా ఉన్నాయి. ఇంటి నిర్మాణాల పేరిట అనుమతులు పొంది కమర్షియల్ షటర్లను నిర్మిస్తున్నారు. ఇదంత తెలిసిన అధికారులు మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదు. కనీసం టౌన్ ప్లానింగ్‌కు వెళ్లకుండా జీపీ అనుమతితోనే కమర్షియల్ షటర్లను అక్రమార్కులు ఇలా ఎన్నో నిర్మించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు నిలిపి వేయించాం

సర్వే నంబరు 1333 హద్దు భూమిలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను నిలిపి వేయించాం. అక్కడ చేపడుతున్న పిల్లర్ల డబ్బాలను జీపీ భవనానికి తరలించాం. ఎవరైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. సర్వే నివేదిక వచ్చే వరకు ఎవరూ నిర్మాణాలు చేపట్ట వద్దు.

– రజనీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, బాల్కొండ

మాలధారణతో చెడు వ్యసనాలు దూరం



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్

రెంజల్: మాలధారణతో చెడు వ్యసనాలను దూరం చేసుకోవచ్చని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. యువత ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకునాలని సూచించారు. మండలంలోని నీలా క్యాంపులో స్నేహ సొసైటీ వ్యవస్థాపకుడు సిద్దయ్య మండలంలోని హనుమాన్ స్వాములకు మండల భిక్షను ఆదివారం ఏర్పాటు చేశారు. భిక్షకు ఆయన హాజరై మాట్లాడారు. యువత సన్మార్గంలో వెళ్తే చెడు ఆలోచనలు దరి చేరవని అన్నారు. ఫలితంగా మద్యం, మత్తు వంటి వ్యసనాలకు దూరంగా ఉండవచ్చన్నారు. హనుమాన్ స్వాములతో పాటు స్నేహ సొసైటీకి చెందిన దివ్యాంగులచే ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కోటగిరి, రుద్రూర్‌లో ఇఫ్తార్ విందు





కోటగిరిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రుద్రూర్ మండల కేంద్రంలో..

రుద్రూర్: మండల కేంద్రంలో విండో మాజీ చైర్మన్ పత్తి రాము ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ సరోజి గంగారాం, విండో చైర్మన్ సంజీవరెడ్డి, తోట సంగయ్య, పత్తి రాము, కోడె శంకర్, ముద్దుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో ..

మండల కేంద్రంలో మైనారిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎజాజ్‌ఖాన్, జడ్పీటీసీ శంకర్ పటేల్, జడ్పీ కోఆప్షన్ సిరాజ్, సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్దు, ఏఎంసీ మాజీ చైర్మన్ అబీద్, సర్పంచ్ పత్తి లక్ష్మణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

ఎంపీ ధర్మపురి అర్వింద్

సిరికొండ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు పని చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం సిరికొండ, ధర్పల్లి మండలాల బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ఇంటింటికీ వివరించాలన్నారు. బీజేపీ మరోమారు పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించనున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, ప్రభారీ వెంకటరమణ, పార్లమెంట్ కన్వీనర్ గద్దె భూమన్న, పద్మారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, నక్క రాజేశ్వర్, రంజిత్ రెడ్డి, గోవింద్, సంజీవ్‌రెడ్డి, శ్రావణ్, నానాపాటేకర్, లింబాద్రి, చారి, శంకర్, రామస్వామి, తాళ్ల శ్రీనివాస్, సతీష్, రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం



ఆర్మూర్: ఆర్మూర్ క్షత్రీయ యువజన సమాజ్ ఎన్నికలలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు నామినేషన్లను స్వీకరించినట్లు ఎన్నికల అధికారి సాత్ పుతె తులసీదాస్ తెలిపారు. పట్టణంలోని క్షత్రీయ సమాజ్ పాఠశాలలో ఆదివారం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్ష పదవికి నాలుగు నామినేషన్లు, ప్రధాన కార్యదర్శి పదవికి రెండు నామినేషన్లు వచ్చాయన్నారు. కొందరి పేర్లు ఓటరు జాబితాలో లేకపోవడంతో కొద్ది సేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో డిప్యూటీ ఎన్నికల అధికారి దమాంకర్ రవీందర్, సహాయ ఎన్నికల అధికారులు దొండి రవీందర్, ఎన్నికల సలహాదారులు కర్తన్ మధుసూదన్, సాత్ పుతె శ్రీనివాస్, క్షత్రీయ సమాజ్ కార్యదర్శి బారడ్ గంగామోహన్, యువజన సమాజ్ మాజీ అధ్యక్ష కార్యదర్శులు జీవి ప్రశాంత్, విశ్వనాథ్ శ్రీను రాజేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

బోధన్‌టౌన్: పట్టణంలోని ఏఆర్ గార్డెన్‌లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. బోధన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి కాంగ్రెస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశాన్ని ప్రతి కార్యకర్త విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఇఫ్తార్ విందు

పట్టణంలోని అప్నా ఫంక్షన్ హాల్‌లో ముస్లిములకు ఇఫ్తార్ విందును సోమవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించన్నుట్లు నాయకులు ఆదివారం తెలిపారు. ఇఫ్తార్ విందులో ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాషా మొయినొద్దీన్, డీసీసీ డెలిగేట్ గంగాశంకర్, పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, కౌన్సిలర్ శరత్‌రెడ్డి, ఖలీం, నాయకులు పాల్గొన్నారు.

పడగల్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు




మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

వేల్పూర్: మండలంలోని పడగల్ రోడ్డుకు ఆదివారం తాత్కాలికంగా మరమ్మతు చేశారు. గత ఏడాది జూలైలో కురిసిన భారీ వర్షానికి పడగల్ నవాబు చెరువు తెగిపోయి తారు రోడ్డు ధ్వంసమై చాలా చోట్ల కొట్టుకుపోయింది. పూర్తిగా తెగిపోయిన చోట వెంటనే మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించారు. చెరువు కింద మూలమలుపు వద్ద రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనాలు అదుపు తప్పితే గుంతలో పడిపోయే ప్రమాదం ఉండడంతో మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి స్పందించి మరమ్మతులు చేయించారని స్థానిక కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

అక్రమాలపై విచారణ జరిగేనా..

- నాణ్యతా లోపంతో నిర్మించిన చెక్ డ్యాంలు
- గతంలో వరద తాకిడికి కొట్టుకుపోయిన కట్టలు
- రూ. కోట్ల నిధులు నీటి పాలు



వరద తాకిడికి కొట్టుకుపోయిన పచ్చలనడ్కుడ చెక్‌డ్యాం కట్ట (ఫైల్)




సుంకెట్ చెక్‌డ్యాం (ఫైల్)

మోర్తాడ్: వాగులో వరద నీటికి అడ్డుకట్ట వేసి రైతాంగానికి మేలు చేయాలనే సంకల్పంతో నిర్మించిన చెక్‌డ్యాంల నిర్మాణాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. దీంతో రూ. కోట్ల నిధులు నీటి పాలయ్యాయి. పెద్దవాగు, కప్పల వాగులలో 12 చోట్ల చెక్ డ్యాంలను నిర్మించారు. ఐదు చెక్‌డ్యాంల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో గత వరద తాకిడికి అవి తట్టుకోలేక కుంగిపోవడం, కూలి పోవడం, కట్టలు తెగిపోయి పంట పొలాలకు నీరు చేరింది. ఫలితంగా రూ. లక్షల పెట్టుబడులు నీటి పాలైంది. చెక్‌డ్యాంల నిర్మాణంతో రైతులకు సాగునీటి తిప్పలు తప్పుతుందని అందరూ ఆశించారు. కానీ కాంట్రాక్టర్ల నిర్వాకం, నాటి అధికార పార్టీ నాయకుల ధన దాహంతో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి.

చెక్‌డ్యాంల పరిస్థితి ఇలా..

- వేల్పూర్ మండల పచ్చలనడ్కుడ, జాన్కంపేట్‌ల మధ్య 2019లో రూ.4.78 కోట్ల వ్యయంతో చెక్‌డ్యాం నిర్మించారు. 3 మీటర్ల ఎత్తులో నిర్మించాలని నిర్ణయించగా అంచనా వ్యయం పెంచడానికి 4.1 మీటర్ల ఎత్తులో నిర్మించారు. వరద తాకిడిని అంచనా వేయకపోవడంతో మట్టికట్టలు కూలి పంట పొలాల్లోకి వరద చేరింది. దీంతో పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో రైతులు ఎంతో నష్టపోయారు.
- మోర్తాడ్ మండలం సుంకెట్ వద్ద రూ.9.38 కోట్లతో చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టారు. రెండు మార్లు చెక్‌డ్యాం కొట్టుకుపోయి రైతుల పంట పొలాలు నీట మునిగిపోయాయి. ఇసుక మేటలు వేయడంతో ఒక్కో రైతు ఒక ఎకరానికి రూ.1లక్ష వరకు ఖర్చు చేయాల్సి వచ్చింది.
- మోర్తాడ్ మండలం పాలెం, ధర్మోరాల మధ్య పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం మట్టి కట్ట కూలి పంటలు పూర్తిగా నీట మునిగాయి. ఈ చెక్‌డ్యాం వద్ద కాజ్‌వే నిర్మించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో మూడు మార్లు కాజ్‌వే కుంగిపోవడం, కూలి పోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.
- ఏర్గట్ల మండలం తొర్తి, మోర్తాడ్ మండలం శెట్‌పల్లిల మధ్య పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.4.80 కోట్లు ఖర్చు చేశారు. 2.5 మీటర్ల ఎత్తులో నిర్మించాల్సిన చెక్‌డ్యాం ఎత్తును 4 మీటర్లకు పెంచారు. చెక్‌డ్యాం ఎత్తు పెరగడంతో నీటి నిలువ సామర్థ్యం ఎక్కువై పంట పొలాలకు నీరు చేరి మునిగిపోయాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో చేసిన తప్పులను సరిదిద్దుకోడానికి గత ప్రభుత్వ పెద్దలు ఎలాంటి అనుమతులు లేకుండానే కట్ట ఎత్తును కుదించారు.
- భీమ్‌గల్ మండలం బెజ్జోరా వద్ద కప్పలవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం ఎత్తు అధికంగా ఉండటంతో పొలాలకు నీరు చేరి రైతులు పంటలను సాగు చేసుకోలేని దుస్థితిలో ఉండిపోయారు.



తొర్తి, శెట్‌పల్లి చెక్‌డ్యాంలో పెంచిన ఎత్తును తొలగిస్తున్న పొక్లెయిన్ (ఫైల్)

అప్పటి అధికార పార్టీ నేతలదే హవా

చెక్‌డ్యాంల నిర్మాణంలో ఇంజినీర్ల మాట కంటే అప్పటి అధికార పార్టీ నేతల మాటనే నెగ్గిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైడ్రాలిక్ అనుమతులు తీసుకోక పోవడం, సుమోటో అనుమతులతోనే చెక్‌డ్యాంల నిర్మాణాలు చేపట్టారు. దీంతో గత ఏడాది కురిసిన వర్షాలకు అధికారుల నిర్లక్ష్యంతో నిర్మితమైన చెక్ డ్యాంలు వరద తాకిడికి కొట్టుకుపోయి రైతులను తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఇకనైనా ప్రభుత్వం స్పందించి చెక్ డ్యాంల నిర్మాణాలపై విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులకు న్యాయం చేయాలి

చెక్‌డ్యాంల నిర్మాణంతో రైతులకు మేలు జరగడం కంటే నష్టం జరిగింది. నాటి అధికార పార్టీ నేతలు అధికారంలో ఉన్నామనే అహకారంతో రైతులపై దురుసుగా వ్యవహరించారు. ప్రభుత్వం విచారణ చేపట్టి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి.

– నవీన్ యాదవ్, రైతు, సుంకెట్

సమాచారం..

నేడు శివాలయంలో ప్రత్యేక పూజలు

ఆర్మూటౌన్: పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ పరిసర ప్రాంతాల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) – 11.20, 4.45, 10.10
భరతనాట్యం – 2.00, 7.25
స్క్రీన్-2 – టిల్లు స్క్వేర్ (తెలుగు) – 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-3 – ది ఫ్యామిలీ స్టార్(తెలుగు) – 11.25, 2.50, 6.15, 9.40
స్క్రీన్-4 – ది ఫ్యామిలీ స్టార్(తెలుగు) – 11.25, 2.50, 6.15, 9.40

గట్లపై చెట్లు ఆదాయానికి మెట్లు..



రెంజర్లలో పొలం గట్టుపై పెరిగిన మామిడి చెట్లు



విరగకాసిన మామిడి

బాల్కొండ: రైతులు తమ పంట పొలాల గట్లపై పండ్ల మొక్కలను పెంచుతూ ఆదాయం పొందుతున్నారు. ముప్కాల్ మండలం రెంజర్లకు చెందిన రైతు రాజశేఖర్ తన పొలం గట్లపై మామిడి మొక్కలను నాటడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగాయి. వాటికి మామిడి కాయలు కూడా విరగ కాశాయి. కాయలను విక్రయిస్తూ లాభాలను ఆర్జిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాజశేఖర్‌తో పాటు గ్రామంలోని పలువురు రైతులు తమ పొలాల్లోని గట్లపై పండ్ల మొక్కలు నాటుతూ లాభాలను ఆర్జిస్తున్నారు.